
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 20 జూలై 2024



వైద్య ఆరోగ్యశాఖలో పలువురు బదిలీ

సంగారెడ్డి అర్బన్, జూలై 19: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. జిల్లా క్షయ నివారణ అధికారిగా పనిచేస్తున్న డా.రాజేశ్వరి హైదరాబాద్‌లోని స్టేట్ టీబీ డెమోనిస్ట్రేషన్ సెంటర్‌లో ఎపిడిమియాలజిస్ట్‌గా బదిలీ అయ్యారు. రంగారెడ్డి జిల్లా క్షయ నివారణ అధికారిగా పనిచేస్తున్న డా.అరుణ బదిలీపై సంగారెడ్డి జిల్లాకు రానున్నారు. సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్ కుమార్, ఇద్దరు ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్‌లు బదిలీ కాలేదు. పలువురు మెడికల్ ఆఫీసర్లకూ స్థానచలనం కలిగింది.

క్వారీ గుంతలో పడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి

24 గంటలైనా నీళ్లలోనే మృతదేహం


ట్రాక్టర్ పడిపోయి క్వారీ గుంత

పటాన్‌చెరు రూరల్, జూలై 19 : మూతపడిన క్వారీ గుంతలో ట్రాక్టర్ అదుపుతప్పి పడిపోవడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని లక్డారంలో గురువారం రాత్రి జరిగింది. 24 గంటలు గడుస్తున్నా మృతదేహాన్ని బయటకు తీయకపోవడంతో శుక్రవారం మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన పి.నర్సింహులు (32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నడుపుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి 30 అడుగుల లోతు క్వారీ గుంతలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం ట్రాక్టర్ కింద ఉండడంతో బయటకు తీయడానికి అధికారులు కృషి చేస్తున్నా సాధ్యం కాలేదు. నీళ్లు నిండుగా ఉండడం.. ట్రాక్టర్ మునిగిపోవడంతో మృతదేహాన్ని బయటకు తీయలేకపోతున్నారు. దీంతో మృతుడి బంధువులు క్వారీ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకురాలు గోదావరి అంజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరకుని ఆందోళనకు మద్దతు తెలిపారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ లక్డారం గేటు వద్ద జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వాహనాలు నిలిచిపోవడంతో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి అక్కడికి చేరుకొని.. మృతదేహాన్ని బయటకు తీసిన అనంతరం పరిహారం గురించి మాట్లాడదామని నచ్చజెప్పారు. ఈమేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొల్లారం కౌన్సిలర్‌పై అనర్హత వేటు

ఓసీ అయి ఉండి.. బీసీ జనరల్ స్థానం నుంచి గెలుపు
అనర్హురాలిగా ప్రకటించిన సంగారెడ్డి జిల్లా కోర్టు

7

అందోలు ఫస్ట్..

..నెక్స్ట్ హుస్నాబాద్

- రూ.లక్ష వరకు రుణమాఫీలో ముందంజ
- రాష్ట్రంలోని తొలి రెండు స్థానాలు మనవే
- ఉమ్మడి జిల్లా రైతులకు రూ.900 కోట్ల లబ్ధి
- మెతుకుసీమకే అధిక ప్రయోజనం
- రెండు, మూడో విడత ఖాతాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా రైతులకు రూ.900 కోట్ల లబ్ధి చేకూరింది. రూ. లక్ష వరకు రుణాలు పొందిన రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమయ్యాయి. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి దాకా రైతుల సెల్‌ఫోన్లకు రుణమాఫీకి సంబంధించి మెసేజ్‌ల మోత మోగింది. ముందురోజు విడుదల చేసిన జాబితాలో పేర్లున్న వారందరికీ ప్రయోజనం చేకూరినట్లుగా తెలుస్తున్నది. రెండు, మూడో విడతలకు సంబంధించిన రైతు కుటుంబాలు, వారి ఖాతాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించారు.

5 లక్షల మంది రుణ గ్రహీతలు

సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో దాదాపు 5 లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు. సుమారు 1.60 లక్షల మంది రైతులు రూ.లక్ష వరకే రుణాన్ని తీసుకున్నారు. మిగితా వారంతా రూ.2లక్షల లోపు రుణజాబితాలో ఉంటారు. ఒక కుటుంబంలో నలుగురి పేరిట రూ.2లక్షల రుణం ఉంటే వారి పేర్లు తాజా జాబితాలో రాలేదు. వీరిని రూ.2 లక్షల రుణ జాబితాలో చేర్చినట్లుగా తెలుస్తోంది. ఫలితంగా రైతుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం భారీగా పెరగనున్నది. గురువారం జరిగిన మాఫీతో పోల్చితే నాలుగింతలు ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మెతుకుసీమకే అధిక నిధులు

తొలివిడత రుణమాఫీ కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.6,100 కోట్లను విడుదల చేశారు. రూ.లక్ష వరకు రుణం తీసుకున్న వారందరి ఖాతాల్లోనూ ఈ నిధులు జమ చేశారు. ఇందులో రూ.900 కోట్లు ఉమ్మడి మెదక్ జిల్లాకే కేటాయించారు. రాష్ట్రంలో అత్యధిక రుణాలు మాఫీ అయిన నాలుగు నియోజకవర్గాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 3 నియోజకవర్గాలు ఉన్నాయి. తొలి రెండు స్థానాల్లో అందోల్, హుస్నాబాద్ ఉండగా.. 4వ స్థానంలో దుబ్బాక ఉంది. రూ.వంద కోట్లకు పైగానే ఈ నియోజకవర్గంలోని రైతులకు లబ్ధి జరిగింది. పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరు నియోజకరవ్గం ఉమ్మడి జిల్లాలో చిట్టచివరగా నిలిచింది. ఇక్కడ కేవలం రూ.14.38 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. సిద్దిపేట నియోజకవర్గ రైతులకు కేవలం రూ.50 కోట్లే లబ్ధి చేకూరింది.

లక్ష దాటినవారికి వచ్చే రెండు విడతల్లో..

తొలి విడతలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష వరకు రుణాలు మాఫీ అయ్యాయి. ఇందులో ఎక్కువగా కుటుంబంలో ఒకే రైతు ఉన్నవారే. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ రైతులు ఉన్న కుటుంబాలు రూ. లక్ష కంటే ఎక్కువ రుణాలు ఉన్న జాబితాలో ఎక్కువగా ఉన్నారు. రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు, మూడో విడతలో రూ.2లక్షల వవరకు రుణాలను మాఫీ చేయనున్నారు. మొదటి విడతను విజయవంతంగా పూర్తి చేయడంతో ప్రస్తుతం రెండో విడతపై దృష్టి సారించారు. ఒక కుటుంబంలో రూ.1.50 లక్షల వరకు రుణం పొందిన వారి ఖాతాలను గుర్తిస్తున్నారు. పాస్‌బుక్‌ను ప్రామాణికంగా చేసుకొని వారి జాబితాను జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే ఇలాంటి ఖాతాలపై ఒక అంచనాకు వచ్చారు. విమర్శలకు తావు లేకుండా ముందుజాగ్రత్తగా నిశితంగా పరిశీలిస్తున్నట్టు అధికారుల వర్గాలు పేర్కొంటున్నాయి.


రుణమాఫీ మెసేజ్‌లు చూసుకుంటున్న రైతులు

అసెంబ్లీ నియోజకవర్గం	కుటుంబాలు	రైతుల ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)
అందోల్	19,186	20,216	107.83
హుస్నాబాద్	18,101	18,907	106.74
దుబ్బాక	17,811	19,986	101.29
నారాయణఖేడ్	16,524	17,265	94.70
నర్సాపూర్	17,427	18,542	89.87
మెదక్	17,092	18,308	89.00
గజ్వేల్	15,383	16,220	84.21
జనగామ	11,522	11,954	69.04
జహీరాబాద్	9,140	9,414	56.66
సిద్దిపేట	8,527	9,022	50.18
సంగారెడ్డి	7,189	7,528	39.21
పటాన్‌చెరు	2,734	2,843	14..38

సర్కారు బడుల్లో సార్లేరీ..?

- మెదక్ జిల్లాలో 654 మంది టీచర్ల కొరత
- 897 ప్రభుత్వ స్కూళ్లలో 84 వేల మంది విద్యార్థులు
- ఏకోపాధ్యాయుడితో కొనసాగుతున్నవి 253...

మెదక్ అర్బన్, జూలై 19: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. నియామకాలు లేక కొన్నేళ్లు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన విద్యాబోధన అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కార్ మౌలిక వసతులు కల్పిస్తున్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేక.. పాఠాలు అర్థం కాక విద్యార్థులు చదువుల్లో వెనుకబడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించి పరీక్షలను ప్రారంభించింది. ఈ ప్రక్రియ మరో రెండు.. మూడు నెలల వరకు కొనసాగే అవకాశం కనిపిస్తుంది. బడులు ప్రారంభమై.. 40 రోజులు గడుస్తున్నది. ఇటీవల పదోన్నతులతో తరగతులు సరిగ్గా జరగలేదు. దీంతో, విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారుతున్నది.

కుంటుపడుతున్న విద్యా బోధన

ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చదువు ఎలా సాగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడం, బదిలీల్లో గతంలో ఆయా పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు పదోన్నతిపై మరో పాఠశాలలకు వెళ్లడం.. అక్కడకు మరో ఉపాధ్యాయుడు రాకపోవడం వంటి కారణాలతో విద్యార్థులకు సరిపడా టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. దాంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్స్‌కు పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సర్దుబాటేనా.. రేషనలైజేషనా?

ఇటీవల చేపట్టిన బదిలీ.. పదోన్నతుల ప్రక్రియ ద్వారా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం వరకు టీచర్ల సర్దుబాటుతో సరిపెడతారా.. లేక రేషనలైజేషన్ చేస్తారా అనే విషయం విద్యాశాఖ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అవసరం ఉన్న పాఠశాలకు టీచర్లను సర్దుబాటు చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఒక్క టీచర్ లేని పాఠశాలలు ప్రస్తుతం నాలుగు ఉన్నాయి.

3,990 ఉపాధ్యాయ పోస్టులు

మెదక్ జిల్లావ్యాప్తంగా 897 ప్రభుత్వ బడుల్లో 84 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 3,990 ఉపాధ్యాయ పోస్టుల మంజూరు ఉండగా.. 3,366 మంది పని చేస్తున్నారు. 253 పాఠశాలలు ఏకోపాధ్యాయుడితో కొనసాగుతున్నాయి. ఆ టీచర్ సెలవు పెడితే పాఠశాలకు సెలవు ఇచ్చే పరిస్థితి ఉంది. ఇటీవల 1,076 మంది టీచర్లకు బదిలీలు జరగగా.. 705 మందిని రిలీవ్ చేశారు. ఇంకా 371 మంది బదిలీ అయినప్పటికీ ఆ పాఠశాలల్లో బోధించేందుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో వారిని రిలీవ్ చేయలేదు. జిల్లాలో మొత్తం 654 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి.



ఏకోపాధ్యాయుడితో కొనసాగుతున్న గాజిరెడ్డిపల్లి తండా పాఠశాల

బోధనకు ఆటంకం లేకుండా చూస్తున్నాం




ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలతో కొంత సమస్య ఎదురైనప్పటికీ, ఉన్న వారిని సర్దుబాటు చేస్తూ బోధనకు ఆటంకం కలుగకుండా చూస్తున్నాం. జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

-రాధాకిషన్, డీఈవో

7 తరగతులు 7 విద్యార్థులు ఒకే టీచర్

కంది, జూలై 19 : పాఠశాలలో ఏడు తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడు.. ఏడుగురే విద్యార్థులు.. ఇదీ సంగారెడ్డి జిల్లా కంది మండలం తోపుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో పరిస్థితి. ఒకటి, రెండో తరగతుల్లో ఒక్కొక్కరు.. మూడు, నాలుగు క్లాసుల్లో ఇద్దరు, ఐదో తరగతిలో ఒకరు ఉన్నారు. ఆరు, ఏడు తరగతుల్లో పిల్లలే లేరు. వీరందరికీ పాఠాలు బోధించడానికి ఒక్కడే ఉపాధ్యాయుడు. బడికి వచ్చే విద్యార్థులను ఒకే తరగతిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఆయనకు అత్యవసరమై సెలవు పెడితే ఆ రోజు బడికి కూడా సెలవే!! ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఇస్తున్నా.. ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెప్తున్నా.. మధ్యాహ్న భోజనం అందిస్తున్నా.. ఆడుకోవడానికి చక్కటి ఆటస్థలం ఉన్నా విద్యార్థులు ఆసక్తి కనబర్చడంలేదు.


బడికి వచ్చిన ముగ్గురు విద్యార్థులకు పాఠాలు చెప్తున్న టీచర్

నెల రోజులు తిరిగినా విద్యార్థులను బడికి పంపించలేదు



తోపుగొండలోని ప్రభుత్వ పాఠశాలలో చదవడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. వెయ్యి మంది జనాభా కలిగిన గ్రామంలో ఊరి 70-80 మంది ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్నారు. రెండు నెలలపాటు ఇంటింటికీ తిరిగి పిల్లలను బడికి పంపాలని కోరినా ఎవ్వరూ స్పందించలేదు.

- నర్సింహ, ఉపాధ్యాయుడు, తోపుగొండ ప్రాథమికోన్నత పాఠశాల

హోటల్‌లో బిర్యానీ తిని 15 మందికి అస్వస్థత


చికిత్స పొందుతున్న రోహిత్

తూప్రాన్, జూలై 19: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని ఓ హోటల్‌లో బిర్యానీ తిని 15 మంది అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటన మంగళ, బుధవారాల్లో చోటు చేసుకోగా, శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణంలో కొద్దిరోజుల క్రితం బిర్యానీ (మండి) హోటల్ ఏర్పాటు చేశారు. దాంతో స్థానిక యువత ఆ హోటల్‌లో ఎక్కువగా భోజనాలు చేసేందుకు ఆసక్తి చూపించారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఆ హోటల్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, జ్వరం రావడంతో ఎవరికి వారు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. ఒక్కసారిగా పెద్దఎత్తున ఆస్పత్రిలో చేరడంతో, ఒక్కొక్కరు ఆ హోటల్‌లో భోజనం చేసినట్లు తెలిసింది. దీంతో ఫుడ్ పాయిజన్ జరిగినట్లు గుర్తించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన రోహిత్, లోకేష్, రఘువంశీ, సతీష్, లక్ష్మీశ్రీ దంపతులు, నాగేంద్ర, భరత్, కరుణాకర్, ప్రశాంత్, మణికంఠ, సన్నీ, కిరణ్, భాను తదితరులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం కొందరు మేడ్చల్, తూప్రాన్, కొంపెల్లి, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

'డ్రై-డే'తో దోమల నివారణ

- సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డిలోని రిక్షా కాలనీలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జూలై 19 : దోమల నివారణకు ప్రతీ శుక్రవారం డ్రై-డే పాటించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని రిక్షా కాలనీలో మున్సిపల్, ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాపించే డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, విషజ్వరాలు, సీజనల్ వ్యాధులను పరిశుభ్రత, దోమల నివారణ ద్వారా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలకు ఆవాసంగా మారే అవకాశం ఉంటుందని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలున్న ఇళ్లకు ఆశ కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అంతకుముందు రిక్షా కాలనీలోని బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. ఆమె వెంట ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, మున్సిపల్, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి

- మత్తు పదార్థాల నిర్మూలనకు ఎస్-నాబ్ ఏర్పాటు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్


మోర్గి చౌరస్తాలో చెక్‌పోస్టు భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 19: జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా కట్టడి చేయాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పోలీసు అధికారులను ఆదేశించారు. నారాయణఖేడ్ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అదనపు ఎస్పీ సంజీవ్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నందున డివిజన్ పరిధిలో క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం జిల్లాలో ఎస్-నాబ్ (సంగారెడ్డి జిల్లా నార్కొటిక్ అనాలసిస్ బ్రాంచ్)ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉంటే 8712656777కు కాల్, లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. డివిజన్ పరిధిలో పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని సూచించారు. అలవాటుగా నేరాలు చేస్తున్న వారిపై హిస్టరీ షీట్ తెరవడానికి ప్రతిపాదనలు పంపించాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. అంతకుముందు ఆయన నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి చౌరస్తాలో ఉన్న పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించారు. అనంతరం పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. సీఐ, ఎస్సైతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోర్గి చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బందికి పూర్తి రక్షణతో పాటు అన్నిరకాల వసతులు ఉండేవిధంగా ఆధునీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, చంద్రశేఖర్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు ఉన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

- డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన పనుల్లో తాత్సారం
- 510 పనులకు రూ.46.02 కోట్లు
- పూర్తయినవి 334 పనులు

సంగారెడ్డి టౌన్, జూలై 19 : నిధులు లేక పనులు నిలిచిపోవడం, మందగించడం సాధారణమే... కానీ, చేతినిండా నిధులున్నా అభివృద్ధి పనులు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో కంకర, ఇసుక, మట్టి తదితర మైనింగ్ యాజమాన్యల నుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో సేకరించిన నిధులను ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) పేరిట మంజూరు చేసిన ఈ నిధులు ఆరు నెలల్లోగా సంబంధిత పనులకు ఖర్చు చేయాలి. అయితే, సంగారెడ్డి జిల్లాలో 2018 నుంచి ఆ దిశగా అధికారుల చర్యలు కానరావడం లేదు. నిధులు ఉన్నప్పటికీ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదనే విమర్శలు ఉన్నాయి. జనవరిలో మంత్రి దామోదర్ సమీక్ష నిర్వహించి. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు.

ప్రారంభమే కానీ 25 పనులు

జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో 510 పనులకు గాను రూ.46.02 కోట్లు కేటాయించారు. 2018 నుంచి ఇప్పటివరకు 334 పనులు పూర్తి కాగా, 151 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 25 పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పూర్తయిన పనులకు రూ.20.60 కోట్లు ఖర్చు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కాగా 2018-19 నుంచి ఆయా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినప్పటికీ పనులు పూర్తికాకపోవడం శోచనీయం. కోహీర్ మండలం బడంపేటలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. సంగారెడ్డిలోని బీసీ హస్టల్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు, పట్టణంలో నీటి సంపు నిర్మాణానికి రూ.15 లక్షలు, రోడ్ల పనులకు మరో రూ.5 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టటడం లేదు. అలాగే కొండాపూర్ మండలంలో రెండు చోట్ల మహిళ సమాఖ్య భవనాల నిర్మాణాలకు రూ.13 లక్షల చొప్పున రెండింటికీ రూ.26 లక్షలు మంజూరు చేశారు. సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లిలో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేసినా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

సంగారెడ్డి జిల్లాలో 2018 నుంచి 2023 వరకు

నియోజకవర్గం	పనులు	నిధులు(కోట్లలో)	వ్యయం	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి	చేపట్టని పనులు
సంగారెడ్డి	87	7.68	3.71	52	21	14
పటాన్‌చెరు	132	19.37	6.53	104	28	0
జహీరాబాద్	177	11.92	5.32	78	89	10
నారాయణఖేడ్	97	5.75	3.95	83	13	1
నర్సాపూర్(హత్నూర)	17	1.30	1.09	17	0	0
అందోలు	0	0	0	0	0	0

అందోలుపై చిన్నచూపు

జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా అందోలు నియోజకవర్గానికి ఒక్కపైసా కేటాయించకుండా చిన్నచూపు చూశారు. 2018 నుంచి 2023 వరకు జిల్లా పరిధిలో 510 పనుల్లో ఒక్కటి కూడా అందోలు నియోజకవర్గంలో చేపట్టలేదు. ప్రస్తుతం మంత్రి దామోదర్ రాజనర్సింహ మైనింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో అందోలు నియోజకవర్గానికి డీఎంఎఫ్‌టీ నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ఎలాంటి హెచ్చరికలు లేని జాతీయ రహదారి పక్కన అండర్ పాస్

పట్టు తప్పిందా.. ప్రాణాలు గోవిందా!

మాసాయిపేట, జూలై 19 : మాసాయిపేట మండలం బొమ్మారం చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన అండర్‌పాస్ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. పలు గ్రామాల ప్రజలు గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా ఇటీవలనే దీని నిర్మాణం పూర్తి చేశారు. అయితే, సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి సైన్ బోర్డులను ఏర్పాటు చేయలేదు. భారీ వాహనాలు హైవేపై నుంచే 24 గంటలు వెళుతుంటాయి. అటువైపుగా వెళ్లే వాహనదారులు ఈ అండర్‌పాస్ ఉందనే విషయం గమనించకపోతే ప్రమాదాలు తప్పవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

దొరల రాజ్యం పోయి... దొంగల రాజ్యం వచ్చింది

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సిద్దిపేట క్రైం, జూలై 19 : రాష్ట్రంలో దొరల రాజ్యం పోయి దొంగల రాజ్యం వచ్చిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి తీసుకునే కమిషన్ల పార్టీగా మారిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనంలో నుంచి పొయిలపడ్డట్లు అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరత్వం చేయడానికి ప్రణాళికలు లేకుండా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏడు నెలలు గడిచిన సగం రోజులు ఢిల్లీకి వెళ్లి రావడం సరిపోయిందని, ప్రజల సమస్యల పట్ల పాలన కొనసాగించ లేదన్నారు. రైతుల రుణమాఫీ తూతూ మంత్రంగా ప్రారంభించారని రూ.64 వేల కోట్ల మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.6,800 కోట్లు మాఫీ చేసి పాలాభిషేకాలతో సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ చోట బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, విద్యాసాగర్‌రావు, విభూషణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎంపీడీవో కార్యాలయం

● అపరిశుభ్రంగా పరిసరాలు
● సమయపాలన పాటించని సిబ్బంది

కంది, జూలై 17 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అస్తవ్యస్తంగా తయారైంది. కందిలో 65 నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాత జడ్పీహెచ్‌ఎస్‌లో ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతున్నది. మండలం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ ఎంపీడీవో కార్యాలయం సరైన వసతులకు నోచుకోవట్లేదు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు కలిపి 48 వేలకు పైగా జనాభా ఉన్నప్పటికీ ఈ కార్యాలయంలో ఉండాల్సిన అటెండర్‌కు రెగ్యులర్ పోస్టు లేకపోవడం గమనార్హం. అంతేగాక కార్యాలయం ఊడ్చడానికి స్వీపర్, రాత్రిపూట కాపల ఉండేందుకు వాచ్‌మెన్ లేరు. సమావేశాల కోసం ఓ మీటింగ్‌హాలు అందుబాటులో లేదు. కార్యాలయం ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడంతో కంప్యూటర్లు, రికార్డులకు భద్రతకు కరువైంది. మూడు నెలల క్రితం ఈ కార్యాలయంలో దొంగలు పడి టాయిలెట్లలోని నల్లాలను చోరీ చేశారు. అదిగాక ఎంపీడీవో కార్యాలయంలో స్వీపర్ లేకపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. కార్యాలయం చుట్టూ చెట్లు ఉండడంతో చెట్ల నుంచి రాలే ఆకులు, పూతతో ఆవరణ మొత్తం నిండిపోయి ఉంటుంది. వర్షం పడితే చాలు చిత్తడిగా మారుతుంది.

11 దాటిన తర్వాత కార్యాలయానికి..

ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్ఆర్ఈజీఎస్ (మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం)కు సంబంధించి ఒక అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్, ఒక ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ఉన్నారు. అయితే వీరు ఎవరూ సమయపాలన పాటించడం లేదు. ఉదయం11 గంటలకు దాటిన తర్వాతే వారు కార్యాలయానికి వస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఎప్పుడు వెళ్లిన సిబ్బందికి బదులు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఏదైనా పనికోసమని ప్రజలు ఈ కార్యాలయానికి వస్తే సిబ్బంది వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఏడాదికి దాదాపు రూ. రెండు కోట్ల మేర పనులు జరుగుతున్నప్పటికీ సిబ్బంది అలసత్వంపై అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ విషయమై గ్రామస్తులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.



కంది ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెల్దుర్తిలో దొంగల హల్‌చల్

వెల్దుర్తి, జూలై 19 : మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. రెండు ఇళ్లలో దోపిడీ చేయగా, మరో మూడు ఇళ్లలో చోరికి ప్రయత్నించారు. ఎస్ఐ నవతగౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం... పట్టణానికి చెందిన మహ్మద్ రజియాబేగం, ఆవుసుల నాగరాణి, కిష్టంగారి రాజయ్య ఇంటి తాళాలు పగలగొట్టారు. వారి ఇంట్లో నుంచి సుమారు రూ.20వేల నగదు, 7తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే పట్టణానికి చెందిన మరో రెండు ఇళ్లలో చోరికి ప్రయత్నించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలానికి వెల్దుర్తి పోలీసులు, క్లూస్‌టీం చేరుకుని వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా 20 రోజుల క్రితం వెల్దుర్తి పట్టణంలోని తిరుమల వైన్స్‌కు దొంగలు కన్నం వేశారు. ఈ ఘటన మరవక ముందే మళ్లీ దొంగలు చెలరేగిపోయారు.

హరీశ్ రాజీనామా చేసి మాట నిలుపుకోవాలి

● టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

నంగునూరు, జూలై 19 : రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాల మాఫీ హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని, అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు మాట తప్పకుండా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. శుక్రవారం నంగునూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతు రుణ మాఫీ చేస్తామని ప్రకటించి అమలు చేసి రైతుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు విసిరిన సవాలు నిలుపుకోవాలని లేకుంటే రాజీనామా చేసేంత వరకు విడిచి పెట్టబోమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అచ్చిన సత్తయ్య, ఎంపీటీసీ ఎనగందుల నితిన్, గౌరబోయిన సంపత్, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, గోనెపల్లి శివగౌడ్, జంగిటి శ్రీనివాస్, రాగుల కృష్ణ, బాలయ్య, రంగు అశోక్, గాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం కౌన్సిలర్‌పై అనర్హత వేటు

● ఓసీ అయి ఉండి.. బీసీ జనరల్ స్థానం నుంచి పోటీ
● అనర్హురాలిగా ప్రకటించిన సంగారెడ్డి జిల్లా కోర్టు


అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి కోర్టు ఆదేశాల కాపీలు అందజేస్తున్న బొల్లారం కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, జూలై 19 : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధి బీసీ జనరల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన మహిళా కార్పొరేటర్‌పై జిల్లా కోర్టు అనర్హత వేటు వేసింది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన బి.శైలజ బీసీ జనరల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి నర్సింహారాజుపై గెలుపొందగా, నర్సింహారాజు బి. శైలజ బీసీ కాదని, ఆమెది ఓసీ సామాజికవర్గమని కోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ జరిపి కోర్టు శైలజను అనర్హురాలిగా ప్రకటించింది. రెండో స్థానంలో ఉన్న నర్సింహారాజును కౌన్సిలర్‌గా ప్రకటించాలని తీర్పు చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు ఈ నెల 13నే విడుదల అయ్యాయి. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిశారు. ఆయనను కలిసిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ, నాయకులు లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజ్‌గోపాల్, వెంకటయ్య, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారాజు ఉన్నారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదు

సిద్దిపేట క్రైం, జూలై 19 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని అమ్మాయిని మోసం చేసిన వ్యక్తిపై టూ టౌన్ పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... హుస్నాబాద్ పట్టణం ఎల్లమ్మ బజార్ చెందిన జాలిగామ శ్రీనివాస్ కొన్ని రోజులుగా సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక అమ్మాయితో సోషల్ మీడియా అయిన ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించి పెళ్లి చేసుకుంటానని అవసరాలకు వాడుకున్నాడు. పెళ్లి చేసుకోకపోవడంతో బాధితురాలు సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 23న ఫిర్యాదు చేయగా అతడిపై అత్యాచారం కేసు నమోదు చేసి శుక్రవారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

యువకుడు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

గజ్వేల్, జూలై 19: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టగా యువకుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలోని మల్లన్నసాగర్ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన నిమ్మరాజు రాజేశ్(19) తన స్నేహితుడు శంభయ్యగారి మురళీ(24)తో కలసి గురువారం అర్ధరాత్రి దాటాక గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపునకు కారులో వెళ్తున్నారు. మురళీ కారు నడుపుతుండగా, రాజేశ్ పక్క సీట్లో కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో యూనియన్ బ్యాంకు ఎదురుగా ప్రజ్ఞాపూర్ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పిన కారు చెట్టును బలంగా ఢీకొట్టింది. అనంతరం పక్కన ఉన్న ఎస్‌వీ క్లీనిక్ ఇనుప మెట్లకు ఢీకొట్టగా నిమ్మరాజు రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మురళీ తీవ్రగాయాల పాలవగా, 108 సహాయంతో పోలీసులు రాజేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి, మురళీని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై నిమ్మరాజు రాజేశ్ తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

నీట మునిగి యువకుడి మృతి

హత్నూర, జూలై 19 : ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని చింతల్‌చెర్వు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... చింతల్‌చెర్వు గ్రామానికి చెందిన అంబటి రమేష్(29) నెల రోజుల నుంచి గ్రామ శివారులోని అంబటివారి కుంటలో ఉన్న చేపలకు కాపరిగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి అంబటివారి కుంట వద్దకు వెళుతున్నానని చెప్పాడు. రాత్రికి రమేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం కుంట వద్దకు వెళ్లగా.. కట్టపై బైక్‌తో పాటు చెప్పులు కనిపించాయి. కుంటలోని నీటిలో రమేష్ మృతదేహం తేలుతూ కనిపించింది. మృతుడికి నెల రోజుల క్రితమే పెళ్లి జరగగా, మృతుడి భార్య వీరమణి రోదన మిన్నంటింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయపోల్, జూలై 19 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ పోలీసులు శుక్రవారం మండలపరిధిలోని అంకిరెడ్డిపల్లి వద్ద పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని అంకిరెడ్డిపల్లి వద్ద పోలీసులు, టాస్క్‌బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అటువైపుగా వచ్చిన ఓ టాటాఏస్ వాహనాన్ని ఆపారు. అందులో 18 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించారు. రేషన్‌బియ్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా రాజంపేట నుంచి ఓ రైస్‌మిల్‌కు తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ భాస్కర్ తెలిపాడని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి బియ్యాన్ని దౌల్తాబాద్ ఎమ్ఎల్ఎస్ పాయింటుకు తరలించారు. వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

నిజాంపేటలో టిప్పర్ బీభత్సం..


దుకాణాల వైపు దూసుకొచ్చిన టిప్పర్ లారీ

నిజాంపేట, జూలై 19 : మండల కేంద్రమైన నిజాంపేటలో శుక్రవారం టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. మెదక్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఏపీ 29 వి 8563 నంబరు గల టిప్పర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బీభత్సం సృష్టించింది. బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని గమనించక అదుపు చేయు క్రమంలో టిప్పర్ రెండు ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. టీఎస్ 23 ఈ 3588 నంబర్ గల ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జవ్వగా, మరొక ద్విచక్ర వాహనం స్వల్పంగా దెబ్బతింది. వాహనదారుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

ఇస్రో ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన



శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఇస్రో స్పేస్ ఆన్ వీల్ బస్సు

శివ్వంపేట, జూలై 19 : శివ్వంపేట ఉన్నత పాఠశాలలో గ్రామీణ కృషి విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో శుక్రవారం ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పించారు. దొంతి, కొంతాన్‌పల్లి, చండీ ఉన్నత పాఠశాలలు, సత్యం విద్యా మందిర్, కేజీబీవీ విద్యార్థులకు 'స్పేస్ ఆన్ బస్సు'లో డెమో ప్రదర్శన ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇస్రో ఎస్‌పీడీవో వివి గణేషన్, టెక్నీషియన్ అసిస్టెంట్ ఎస్.రామయ్య, ఎంఈవో బుచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లల్లో చొరబాటు

● పనులు జరుగుతుండగానే ఆక్రమణ
● ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులు
● రెవెన్యూ అధికారులకు కాంట్రాక్ట్ కంపెనీ ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 19 : గత ప్రభుత్వ హయాంలో మెదక్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. మొదటి విడతగా కొందరికి ఇళ్లను మంజూరు చేసి పట్టాలను పంపిణీ చేయగా, దరఖాస్తు చేసుకున్నా వారిలో ఇళ్లు రాని వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. తమకు ఎప్పుడిస్తారోనని ఎదురుచూసిచూసి నీరసించిన పేద కుటుంబాలు ఇళ్లల్లో చిన్నచితక పనులు కొనసాగుతుండగానే చొరబడుతున్నారు.

500 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో..

మెదక్‌కు అప్పటి ప్రభుత్వం 1000 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో మొదటి విడతగా 500 నివాసాలను పూర్తి చేసి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. గత ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాటి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా 500 పట్టాలను నిరుపేదలకు అందజేశారు. మిగతా 500 ఇళ్ల పనులు వివిధ దశలో ఉండగా నమ్మశ్రీ అనే కంపెనీ మరికొన్ని నివాసాలు పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించింది. రెండు నెలలుగా గోడలు, ప్లాస్టరింగ్ పనులను పూర్తి చేసి ప్రస్తుతం ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు.

30 కుటుంబాలకుపైగా..

మరికొన్ని రోజులైతే పనులు పూర్తవుతాయనగా 30 కుటుంబాలకుపైగా ఇళ్లలోకి చొరబాటుకు దిగారు. ఇళ్లను ఆక్రమించుకున్న వారిని అక్కడ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కంపెనీ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన పట్టాలేమైనా ఉన్నాయా అని ప్రశ్నించగా దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడినట్లు తెలిసింది. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు సైతం పాల్పడుతున్నారని సదరు సంస్థ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండుమూడు ఇళ్లకు డోర్లు లేకపోతే అవికూడా వారే తెచ్చుకొని బిగించి నివాసాల్లో చొరబడ్డారు. డబుల్ ఇళ్లను ఆక్రమించుకోవడమే కాకుండా తమ ఇళ్లలో పూర్తిస్థాయిలో పనులు చేయలేదని నిత్యం వాదోపవాదాలకు దిగుతున్నారు.



డోర్ ఏర్పాటు చేసుకుని దానిపై రాసుకున్న పేరు

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

ఇవే కాకుండా ఇదివరకే పట్టాలు పంపిణీ చేసి ఇంటి నంబరు కేటాయించిన వాటిలోకి సైతం కొంతమంది చొరబడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొంతమంది అయితే ఈ ఇల్లు తమదంటూ గోడలు, డోర్లపై పేర్లు, ఫోన్‌నంబర్లు రాసుకొని వెళ్తున్నారు. ఈ విషయమై సదరు కాంట్రాక్ట్ సంస్థ రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



నాయకుల అండదండలతోనే...

మొదటి విడతగా 500 నివాసాల పట్టాలు పంపిణీ చేసి.. రెండో విడతలో మిగతా వారికి ఇస్తామని చెప్పడంతో ఎన్నో ఆశలతో ఎదురుచూసిన పేదలకు నిరాశే మిగిలింది. ఎన్నాళ్లు చూసినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడం లేదని పేదలు కొంతమంది నాయకుల అండదండలతో డబుల్ బెడ్‌రూంలలోకి చొరబడుతున్నారు. పట్టణానికి చెందిన కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే పట్టాలు లేకున్నా ఆక్రమించుకుంటున్నట్లు తెలిసింది. ఇలా ఆక్రమించుకున్న వారు సదరు కాంట్రాక్ట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతూ మీరెవరూ వద్దనడానికంటూ బూతుపురాణాలు వినిపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే పనులు ఎక్కడికక్కడే నిలిపివేసి వెళ్తామని కాంట్రాక్ట్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆశావాహులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



సొంత ఖర్చుతో డబుల్ బెడ్‌రూంకు డోర్ ఏర్పాటు చేసుకుని తాళం వేసుకున్న ఆక్రమణదారులు

హాస్టల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుని కలిసి ఆవేదన

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 19: ఏడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించడం భారంగా మారిందని, పీఎఫ్ డబ్బు సైతం జమచేయడం లేదని వాపోయారు. వారు కలెక్టర్ కార్యాలయంలో గంటల తరబడి కలెక్టర్ కోసం చూడగా.. కలెక్టరేట్‌కు హరీశ్‌రావు రాగా, ఆయనకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ఈ చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా? తక్షణమే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపాలని, ఏడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


హరీశ్‌రావుతో మాట్లాడుతున్న వసతి గృహాల ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

కొండపాక ఫిషరీస్‌కు జాతీయస్థాయి గుర్తింపు


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక

కొండపాక, జూలై 19 : కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ పనితీరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో నిర్వహించిన జాతీయ స్థాయి మత్స్య శిఖరాగ్ర సమావేశంలో కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ తరఫున ప్రతినిధులు టి.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంకను పాలకవర్గం కలిసింది. వారికి కమిషనర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. 500 మంది ముదిరాజ్ మత్స్యకారుల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ప్రయోజనాలను పొందేలా కృషి చేస్తున్న పాలకవర్గాన్ని, కంపెనీ సీఈవో నారదాసు, ఈశ్వర్‌ను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూలై 19 : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో 708 మంది లబ్ధిదారులకు రూ.7.08 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండ అమలు చేసి తీరుతామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ పథకం చారిత్రాత్మకమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి ఆదరాభిమానాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆర్డీవో రాజు, తహసీల్దార్‌లు రవీందర్, సంజీవరావు, ఆయా మండలాలకు చెందిన పార్టీల అధ్యక్షులు హన్మంతరావుపాటిల్, నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

మెదక్ కల్చరల్, జూలై 19 : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర గ్రామీణ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల డీఎల్‌పీవోలు, డీపీవోలతో మంత్రి సీతక్క వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలను చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు పర్యటించి రోజువారి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ లీకేజీలను అరికట్టాలని సూచించారు. పంచాయతీ కార్యాలయాల్లో ఫాగింగ్ మిషన్లు, సరిపడా బ్లీచింగ్ పౌడర్, ఆయిల్‌బాల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీవో, మండల స్పెషల్ ఆఫీసర్లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

బంగ్లాదేశ్ అధికారులకు పాలన విధానాలపై అవగాహన కల్పించిన మెదక్ కలెక్టర్


బంగ్లాదేశ్ అధికార బృందానికి అవగాహన కల్పిస్తున్న రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 19 : బంగ్లాదేశ్ అధికార బృందానికి దేశ పాలన విధానాలపై మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అవగాహన కల్పించారు. నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో 16 మంది బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్లకు పబ్లిక్ పాలసీ, గవర్నెన్స్‌పై శుక్రవారం ఢిల్లీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్లకు భారత కేంద్ర మంత్రిత్వశాఖ పరిధిలోని పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, భారతీయ పాలన, ప్రజా విధానాలను వివరించారు. సుపరిపాలనను ప్రోత్సహించడం, ప్రాధాన్యతా రంగా కార్యక్రమాలను అమలు చేయడంలో దేశంలోని జిల్లా కలెక్టర్లు చేసిన ఆదర్శప్రాయమైన పని గురించి తెలిపారు. ప్రస్తుతం దేశంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. గతంలో ఇన్నోవేటర్ ప్రోగ్రాంలో భాగంగా గుర్తింపుగా వచ్చిన ప్రధాన మంత్రి అవార్డుకు సంబంధించిన వివరాలను తెలిపారు. అవగాహన కల్పించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయా శాఖల ఉన్నతాధికారులు మెమొంటోను అందజేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ

రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు


మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు

సిద్దిపేట టౌన్, జూలై 19 : ఇచ్చిన మాట నిలబెట్టుకునే కల్చర్ కాంగ్రెస్ పార్టీదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగానే త్వరలోనే పెన్షన్ కూడా అమలు చేస్తామని చెప్పారు. ఆగస్టు 15లోపు రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేస్తామన్నారు. కొందరు రైతులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయలేకపోవడంతో వారి ఖాతాల్లో నగదు జమకావడం లేదని, అందుకు ఎవరూ బాధపడవద్దన్నారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ చేయని పనులను, ఏడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి చేస్తే, బీఆర్ఎస్ నాయకులు లేనిపోని వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చడంతోనే కేసీఆర్ పని సగం అయిపోయిందని ఎద్దేవా చేశారు. 2019లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను, కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడి ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరి భాగస్వామ్యులవుతున్నారని చెప్పారు. కేంద్రంలో మోదీ నోట్లు రద్దుచేసి ప్రజలను ఇబ్బందులు పెట్టారని, ఆయన హయాంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాని ప్రశ్నించారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

సంగారెడ్డి జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి

హత్నూర, జూలై 19: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సంగారెడ్డి జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. మండల కేంద్రమైన హత్నూర కేజీబీవీలో శుక్రవారం మిషన్ శక్తి వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్యాంపులో నేర్పిస్తున్న ప్రతీ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, సఖీ సీఏ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

పాత 'బడి' పోయింది..!

● 77 ఏళ్ల నాటి మద్దూరు హైస్కూల్‌పై నిర్లక్ష్యం
● నిధులున్నా ముందుకు సాగని పనులు

మద్దూరు, జూలై 19 : అలనాటి మద్దూరు హైస్కూల్ పాతబడి కళావిహీనంగా తయారవగా ఆధునికీకరణకు గత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎట్టకేలకు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయనుకుంటే నిర్లక్ష్యం నీడ కమ్ముకున్నది. ఇటీవల సర్కారు మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరైనా ఈ పనులు కూడా అసంపూర్తిగానే మిగిలాయి.


నిధులు మంజూరైనా నిర్లక్ష్యం

మద్దూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలది 77 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర. 1947లోనే పాఠశాల ప్రారంభం కాగా, 1950 సంవత్సరంలో 13 గదులతో పక్కా భవనాన్ని నిర్మించారు. డంగు సున్నంతో నిర్మాణం చేపట్టిన పాతకాలం నాటి భవనంలోనే చదువులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలను ఆధునీకరించేందుకు మన ఊరు - మన బడి పథకం ద్వారా రూ.54.31 లక్షలు మంజూరయ్యాయి. కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, విద్యుదీకరణ, బాలికలకు టాయ్‌లెట్ల నిర్మాణం పనులతో పాటు పాఠశాల పునరుద్ధరణ పనులను చేపట్టారు. కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, విద్యుత్‌తో పాటు టాయ్‌లెట్ నిర్మాణ పనులను చేపట్టినా అసంపూర్తిగానే ఉన్నాయి. రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేవు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. నీటి వసతికి సంపు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గదులకు ప్లాస్టరింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం రెండింటి పనులే పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలకు అత్యవసర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద రూ.2.95 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన మూత్రశాలల పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కేవలం పాఠశాల ఎంట్రెన్స్‌లో గేటు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.



బయట ప్లాస్టరింగ్ చేసి పెయిటింగ్ వేయకుండా వదిలేసిన మద్దూరు హైస్కూల్ పాత భవనం, ప్లాస్టరింగ్ చేయని తరగతి గది

పనుల పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలి



విద్యాసంవత్సరానికి ముందే పనులు పూర్తి చేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్ సకాలంలో చేయలేదు. దీంతో విద్యార్థులు పాఠశాలకు రావడానికి విముఖత చూపిస్తున్నారు. విద్యాబోధన చేయడంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అసంపూర్తి పనులు తొందరగా చేపట్టే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. పాఠశాల పెయిటింగ్ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాను. పాఠశాలకు స్వీపర్‌తో పాటు స్కావెంజర్‌ను వెంటనే నియమించాలి.

\- చంద్రశేఖర్‌శర్మ, హెచ్‌ఎం

మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గిద్దాం

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి



కలివేములలో మొక్క నాటుతున్న లలితకుమారి

కంది, జూలై 19: మొక్కలు పెంచుదాం..కాలుష్యాన్ని తగ్గిద్దామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి అన్నారు. కంది మండలపరిధిలోని కలివేముల, చెర్లగూడెం గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో, రోడ్ల కిరువైపులా శుక్రవారం ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని తగ్గిద్దామన్నారు. ప్రతీ గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

● మునిపల్లి, జూలై 19: వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి రామాచారి కోరారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో శుక్రవారం మండల పరిధిలోని కంకోల్ గ్రామంలో ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావుతో కలిసి ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అంతకు ముందు ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో యాదగిరి, టీఏలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ డీఐవో సరెండర్: ఆర్డీవో

నారాయణఖేడ్, జూలై 19: నారాయణఖేడ్ డీఐవోను కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఖేడ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న డీఐవోపై ప్రజల నుంచి వివిధ రకాల ఫిర్యాదులతో పాటు అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

ఎనిమిదో రోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 19: సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం భూములివ్వబోమంటూ చేపట్టిన రైతుల రిలే నిరాహార దీక్ష శుక్రవారం 8వ రోజుకు చేరింది. దీక్షలో చెన్నాపూర్, పెద్దచింతకుంట, లింగాపూర్, బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట రైతులు మహేష్‌గౌడ్, అంజాగౌడ్, కిష్టాగౌడ్, పోచయ్య, అంజయ్య, రాజమౌళి పాల్గొనగా వారికి లోక్‌సత్తా నాయకుడు చంద్రశేఖర్ మద్దతు పలికారు.

పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

● గ్రామాల్లో ముమ్మరంగా ఫ్రైడే- డ్రైడే ● పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించిన అధికారులు

ఝరాసంగం, జూలై 19: వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యం పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండల పరిధిలోని చీల్కేపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని మురుగు కాల్వలను పరిశీలించారు. ఇళ్ల ముందు నిల్వ నీటితో ఉన్న ప్లాస్టిక్ డబ్బాలలోని నీటిని తొలగింపజేశారు. పాత డబ్బాలు, టైర్లలో నీటి నిల్వతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని ప్రజలకు సూచించారు. త్రాగు నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడూ క్లోరినేషన్‌తో శుభ్రం చేయాలన్నారు. స్థానిక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు వెంట ఎంపీవో లక్ష్మయ్య, పంచాయితీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

● నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులోని గృహాల్లో పూల కుండీల్లో, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు పరిసరాల పరిశు



ఝరాసంగం: చీల్కేపల్లిలో ప్లాస్టిక్ డబ్బాలో నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారులు

భ్రతపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు మురుగు కాల్వలు, ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో రసాయన ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● పటాన్‌చెరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారి దేవుజ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ వంద శాతం విజయ



తూప్రాన్ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమలో ఎంపీడీవో యాదగిరి, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

● తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ పరిధి పుట్టకోట పాఠశాల వద్ద శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ హాజరై ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ ఖాజా మొహియుద్దీన్, కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలకు సన్మానం



సన్మానిస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్, జూలై 19: సాధారణ బదిలీలో భాగంగా ఆఫీస్ సబార్డినేట్‌లను 40శాతం ప్రభుత్వం ఆదేశాల మేరకు బదిలీ చేయడం పట్ల తెలంగాణ పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో స్వప్నలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, రాహుల్‌లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఓఎస్‌లకు ప్రమోషన్లు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు నర్సింహులు, భాస్కర్, హైదర్, నర్సింహులు, సంతోష్, జడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

చెట్ల తిమ్మాయిపల్లిలో టీచర్లకు సన్మానం

మాసాయిపేట జూలై 19: గత ఏడేళ్లగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను చెట్లతిమ్మాయిపల్లి పిల్లిగుట్ట తండా గ్రామస్థులు శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. చెట్ల తిమ్మాయిపల్లి పిల్లి గుట్ట తండా పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన గీతాంజలి, రజితలను శుక్రవారం మాజీ సర్పంచ్ మోహన్‌రాథోడ్, ఉప సర్పంచ్ ముఖేశ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, శంకర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

దోమడుగు గ్రామంలో..



దోమడుగులో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు, నాయకులు

గుమ్మడిదల, జూలై 19: మండలంలోని దోమడుగు గ్రామ ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, భాస్కరారెడ్డి, ఆదిలక్ష్మి, కల్యాణి, షరీఫ్, మంగమ్మ, స్వప్న, విజయశ్రీ తోపాటు నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం దోమడుగు గ్రామ మాజీ ఎంపీటీసీ గోవర్దన్‌గౌడ్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌రె గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

మక్తక్యాసారంలో ఘనంగా బోనాలు

మునిపల్లి, జూలై 19: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని మక్తక్యాసారం గ్రామంలో మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో మునిపల్లి మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ దంపతులు పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెండింగ్ డీఏలు తక్షణమే విడుదల చేయాలి

రామాయంపేట, జూలై 19: చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏలు తక్షణమే విడుదల చేయాల్సిందిగా టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రణీద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రామాయంపేట మండల పరిధి దామరచెరువు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెఫ్ట్ ఓవర్ వెకెన్సీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ గౌడ్, సరాఫ్ ఇంద్రసేనా, మోహన్‌శర్మ, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 19 : విద్యార్థులు నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ డిస్ట్రిక్ట్ చైర్మన్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యువత నైపుణ్య దినోత్సవం, అంతర్జాతీయ న్యాయ దినోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. లయన్ కలాలి చంద్రశేఖర్‌గౌడ్ దాతృత్వంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

తూప్రాన్, జూలై 19: ముదిరాజ్ కులస్తుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు తబలాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ముదిరాజ్‌ల సమస్యలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులకు, తహసీల్దారు విజయలక్ష్మికి అందజేశారు. 2009లో ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో మార్చాలని జారీ చేసిన ఆదేశాలు ఇంకా అమలు కాలేదని, ఆ ఆదేశాలు అమలు చేసి బీసీ-ఏలో చేర్చాలని కోరుతూ పలు డిమాండ్లు చేశారు. మండల అధ్యక్షుడు ప్రశాంత్, గుమ్మడి జనార్దన్, పట్టాభి శ్రీనివాస్, జంగం రాములు, అరకల సత్యానారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● వెల్దుర్తి: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి తక్షణమే బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మండల మండల అధ్యక్షుడు శెట్టి నర్సింహులు పేర్కొన్నారు. శుక్రవారం ముదిరాజ్ కులస్తులు వెల్దుర్తి తహసీల్దార్ తులసీరామ్‌కు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులతో కలిసి మండల అధ్యక్షుడు ముదిరాజ్ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంను అందజేశారు.కార్యక్రమంలో నాయకులు స్వామి, నాయకులు తోటనర్సింలు, గోపాల కృష్ణ, పోచయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

● పెద్దశంకరంపేట: ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్దశంకరంపేట ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కి వినతి పత్రం సమర్పించారు. ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ముదిరాజ్‌లను బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ- ఏ లోకి మార్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘంజిల్లా ఉపాధ్యక్షులు అంజయ్య, మండల ముదిరాజ్ సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

● హవేళిఘనపూర్: ముదిరాజ్ కులస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గిర్దావర్ ఆబేద్‌కు ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు జవాజి పెంటయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘనాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, మహేందర్, శ్రీనివాస్, గంగారాం, లక్ష్మయ్య అరవింద్, తరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ సంబురాలా?



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, జూలై 19: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం నర్సాపూర్‌లో ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేయాల్సింది పోయి అనేక నిబంధనలు పెట్టి రూ.లక్ష మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఇవ్వాల్సి రూ.11,250కోట్లు ఇవ్వకుండా రుణమాఫీ కింద కేవలం రూ.6,068కోట్లు మాత్రమే మాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేసిన సంబురాల్లో రైతులు ఎక్కడా పాల్గొనలేదని కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే ఆర్భాటం చేశారన్నారు. వెల్దుర్తి మండలంలోని రైతు సంబురాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్‌లో పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే ఫొటో పెట్టి తనను విస్మరించి అవమానపరిచారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిం, మాజీ ఎంపీటీసీలు సత్యంగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ పేరిట కాంగ్రెస్ మభ్యపెడుతుంది

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి అర్బన్, జూలై 19: రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మభ్యపెడుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు ఒకేసారి రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించి రూ.6 వేల కోట్లు మాత్రమే చేశారన్నారు. లక్షలోపు రుణాల మొత్తం కేసీఆర్ హయాంలో రూ.19 వేల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.6 వేల కోట్లకు ఎలా తగ్గిందని, ఎవరిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామన్నారు.

రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలి

● బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి



సంగారెడ్డి అర్బన్, జూలై 19: రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు ప్రమాణికంగా తీసుకోవడం వల్ల లక్షలాది మంది రైతులకు రుణమాఫీ వర్తించకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఆదాయపన్ను పేరుతో కొందరిని, రీషెడ్యూల్ పేరుతో ఇంకొంత మందికి రుణమాఫీ ఎగ్గొట్టి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రూ.34 వేల కోట్ల మేర రుణమాఫీని ఒకేసారి బేషరతుగా అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిబంధనల పేరుతో అన్నదాతలను అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 చొప్పున అన్నదాతల ఖాతల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల కింద మహిళలకు ఇస్తామన్న రూ.2500 చొప్పున ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున బీజేపీ పోరాటాలు కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

అర్హులకు అందని రుణమాఫీ

పుల్‌కల్, జూలై 19: రుణమాఫీ అర్హులందరికీ అందని ద్రాక్షలాగే మిగిలిందని, పుల్కల్ పీఏసీఎస్ చైర్మన్, సంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి ఆరోపించారు. పుల్కల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన రూ.లక్ష రుణమాఫీ అందరికీ అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. పుల్కల్ వ్యవసాయ సహకార సంఘంలో 289 మంది లబ్దిదారులుండగా, కేవలం 171 మందికి మాత్రమే రుణమాఫీ జాబితాలో పేర్లు రావడం పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15వ తేదీలోపు రూ.రెండు లక్షలు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు.

హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం

నర్సాపూర్, జూలై 19: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలు పూర్తిగా అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు అనేక సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. రుణమాఫీ రూ.2లక్షలు చేస్తామని చెప్పి లక్ష మాత్రమే చేసి సంబురాలు చేసుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికీ రైతులకు రైతుకు ఇవ్వాల్సి పెట్టుబడి సహాయం ఎకరాకు 15వేలు ఇస్తామని చెప్పి, ఇచ్చే రూ.10వేలు కూడా ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రమణ, సీనియర్ నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బర్దిపూర్‌లో వివాహిత అదృశ్యం



లావణ్య

టేక్మాల్, జూలై 19: టేక్మాల్ మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గురువారం రాత్రి ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రొడ్డ లావణ్య(24) భర్త మహేష్ 5 నెలల క్రితం మృతి చెందగా, ఆమె వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు సంతానం. గురువారం అర్ధరాత్రి లావణ్య ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అలికిడి కావడంతో మామ కిష్టయ్య లేచి తలుపు తీసే ప్రయత్నం చేయగా బయటి నుంచి గడియపెట్టి ఉంది. దీంతో ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు తలుపులు తీసి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కిష్టయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయిపహాడ్‌లో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పుల్‌కల్, జూలై 19: మండలంలోని రాయిపహాడ్‌లో శుక్రవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన జంగం బసమ్మకు చెందిన రెండు ఎడ్లు గ్రామ శివారు ప్రాంతంలో మేత మేస్తుండగా, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో తనకు తీవ్ర నష్టం జరిగిందని, విద్యుత్ అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందజేయాలని ఆమె కోరారు.

చెట్లు నరికిన పరిశ్రమలకు నోటీసులు

చిన్నశంకరంపేట, జూలై 19: మండలంలోని రుద్రారం గ్రామ శివారు శ్రీరాజ ఐరన్ స్టీల్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, అను పాస్టీనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలకు చెందిన యాజమాన్యం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు గురువారం సూరారం రోడ్డుపై ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికివేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదరి అనురాధ, తమ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి, ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేసినుట్లు తెలిపారు.

చేసిన సేవలే గుర్తింపును తెస్తాయి: డీఎస్పీ



బదిలీ అయిన ఎస్ఐలకు సన్మానం చేస్తున్న డీఎస్పీ రామ్మోహనరెడ్డి, సీఐలు

జహీరాబాద్, జూలై 19: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే అధికారులు ప్రజలకు చేసిన సేవలే గుర్తింపును తెచ్చిపెడతాయని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో బదిలీపై వెళ్లిన పోలీసులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం విధినిర్వహణలో భాగంగా ఎక్కడికి వెళ్లినా అందరితో కలుపుగోలుగ ఉంటేనే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అనంతరం పట్టణ సీఐ. రాజబోయిన రవి మాట్లాడుతూ జహీరాబాద్ డివిజన్‌లో పరస్పరం సహకరించుకుంటూ పనిచేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. జహీరాబాద్ డివిజన్ నుంచి బదిలీపై వెళ్తున్న పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి, రహ్మాన్, బదిలీపై డివిజన్‌కు వచ్చిన పట్టణ ఎస్ఐ కాశీనాథ్, నరేష్, రాజిరెడ్డి, క్రిష్ణ, అరుణ్‌కుమార్ తదితరులను జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి, సీఐలు రాజబోయిన రవి, నయిమొద్దీన్ తదితరులు ఘనంగా సన్మానించారు.

మంత్రి చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పుల్‌కల్, జూలై 19: మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామ శివారులో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు అమర్చారు. పెద్దారెడ్డిపేట, సింగూరు, రాయిపాహాడ్, మంతూరు గ్రామాలకు విద్యుత్‌లో ఓల్టేజి సమస్య తీర్చేందుకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌లో అప్పట్లో కేవలం 3 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీంతో ఆయా గ్రామాలకు సరైన విద్యుత్ సరఫరా జరుగకపోవడంతో ఇన్నాళ్లు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సబ్‌స్టేషన్‌లో అమర్చిన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, టెంకాయలు కొట్టి ప్రారంభించారు. పదేళ్లుగా పట్టించుకోని సమస్యను మంత్రి దామోదరరాజనరసింహ తీర్చారని ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ శ్రీనివాస్, ట్రాన్స్‌కో జోగిపేట డీఈ శ్రీనివాస్, ఏడీ శ్రీనివాస్, టీఏడీఏ రామేశ్వర్‌స్వామి, ఏఈలు దుర్గయ్య, ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, అంజయ్య, అనంతం, మంజ్యానాయక్, కుమ్మరి సురేష్, గంతి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు హెరిటేజ్ ఇన్సూరెన్స్ సౌకర్యం

● హెరిటేజ్ డైరీ రీజినల్ హెడ్ వరప్రసాద్

గుమ్మడిదల, జూలై 19 : గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులను పోత్సహించేందకు హెరిటేజ్ సంస్థ రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు హెరిటేజ్ డైరీ రీజినల్ హెడ్ వరప్రసాద్ తెలిపారు. పాడి రైతులకు హెరిటేజ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల రైతు సంఘంలో పాలు పోసే రైతులకు జిల్లా రైతు సమఖ్యా ఉపాధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ హెడ్ వరప్రసాద్ మాట్లాడుతూ పాలు పోసే రైతులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని తెలిపారు. అంతేకాకుండా పశువుల కొనుగోలు నిమిత్తం లోన్లు కూడా ఇస్తామని తెలియజేశారు కార్యక్రమంలో గుమ్మడిదల హెరిటేజ్ డైరీ మేనేజర్ బొడ్డు మల్లయ్య, పూడూరు డైరీమేనేజర్ మల్లేశం, పాడి రైతులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలి

● టీయూడబ్ల్యూజే ఐజేయూ డిమాండ్

సంగారెడ్డి టౌన్, జూలై 19: పలు మీడియా సంస్థలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మాధురికి వినతి పత్రం అందజేశారు. బాధ్యతగల రాజ్యసభ సభ్యుడైన విజయసాయిరెడ్డి విలేకరుల సమావేశంలో జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. ఆయన తీరును ఎండగట్టిన జర్నలిస్టులు, ఛానళ్లు, పేపర్ల యజమానులపై ఇష్టారీతిన మాట్లాడటం సరికాదని ఖండించారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, ఉపాధ్యక్షుడు శిథిక్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆసిఫ్, నాయకులు శ్రీనివాస్, రాజేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో వారానికి రెండు రోజులు రవాణ శాఖ సేవలు

నారాయణఖేడ్, జూలై 19: వాహనదారుల సౌలభ్యం కోసం వారానికి రెండు రోజులు నారాయణఖేడ్‌లో రవాణాశాఖ సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొఅన్నారు. గతంలో డ్రైవింగ్‌లైసెన్సులు, రినివల్, వాహన రిజిస్ట్రేషన్‌లు, ఫిట్‌నెస్‌ల కోసం జహీరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని, తాను ఇటీవల రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యను వివరించినట్టు చెప్పారు. ఈ మేరకు మంత్రి రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారన్నారు. త్వరలోనే ఖేడ్‌లో ఆర్టీఏ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. సమావేశంలో సీడీఐ చైర్మన్ శాదుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సేవాలాల్ సంఘం రాష్ట్రనాయకులు రమేష్ చౌహాన్, నారాయణ, తదితరులు ఉన్నారు. కాగా నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే తెలిపారు.. కంగ్టిలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామన్నారు. కాగా ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు బాధితులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు.

● కల్హేర్: కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రిని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలో సంతకాలు పెట్టిన వైద్యాధికారి, ఇతర ముగ్గురు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 పడకల ఆసుపత్రిలో ఒక్కరే ఏఎన్ఎం విధులు నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేస్తూ వైద్యాధికారి అనిల్‌రెడ్డిని ఫోన్‌లో గైర్హాజర్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెండో రోజూ వీవిన్ పరిశ్రమ కార్మికుల ఆందోళన

జిన్నారం, జూలై 19: గడ్డపోతారంలో పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ వీవిన్ పరిశ్రమ కార్మికులు రెండోరోజూ ఆందోళన నిర్వహించారు. ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ శుక్రవారం పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన జరిపారు. పరిశ్రమ యాజమాన్యం తమకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

గ్రామాల్లో రుణమాఫీ సంబురాలు



పటాన్‌చెరు: బీరంగూడలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జోగిపేట, జూలై19: రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని హర్షిస్తూ మండలంలోని అక్సాన్‌పల్లిలో శుక్రవారం సీఎం చిత్రపటానికి పార్టీనాయకులు క్షీరాభిషేకం జరిపారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఉంచి పాలతో అభిషేకం జరిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు భూమా గౌడ్, నాయకులు గడ్డమీది వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: మండల పరిధిలోని అనంత్‌సాగర్, ర్యాకల్, మాద్వార్ తండాతో పాటు పలు గ్రామాలు, తండాల్లో రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. పార్టీ అగ్రనాయకుల ఫ్లెక్సీలతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీలకు రైతులు, నాయకులు పాలతో అభిషేకించారు.

● కోహీర్: మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. వెంకటాపూర్ గ్రామంలో 85 మంది రైతులకు రుణమాఫీ కావడం పట్ల గ్రామంలోని రైతులందరూ శుక్రవారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, బాపూజీ, రవికుమార్, చిన్ననరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

● కల్హేర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో సంబురాలు మిన్నంటాయి. కల్హేర్, సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో శుక్రవారం నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన రైతుల సమావేశాల్లో పాల్గొని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో ఏడీఏ నూతన్‌కుమార్, సీడీసీ చైర్మన్ షాదుల్, ఏవోలు శశాంక్, శ్రీకాంత్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ గుప్తా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మనీష్‌పాటిల్, పోచయ్య, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా సిర్గాపూర్ మండలంలోని బొక్కస్‌గామ్ పీఏసీఎస్ పరిధిలోని సుల్తానాబాద్ గ్రామంలో 170 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుండు వెంకట్‌రాములు శుక్రవారంప్రకటనలో తెలిపారు.

● కంగ్టి: కంగ్టిలోని రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేనటువంటి రూ.2లక్షల రుణమాఫీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేసి ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీవోసత్తయ్య,మాగిషుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ శాదుల్, ఏవో ప్రవీణ్‌చారి పాల్గొన్నారు.

● పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శివాలయం ఎక్స్‌రోడ్డులో శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు కొల్లూరుమల్లేష్, నదువు మల్లేష్, యూసుఫ్, భ్రమరాంబామల్లిఖార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఖైస సుధాకర్ యాదవ్, మన్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

●చేగుంట: మండలకేంద్రంలోని స్థానిక గాంధీ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, నర్సింహులు, శ్రీను, పరంజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేయడంతో శుక్రవారం చిన్నశంకరంపేట



పెద్దశంకరంపేట: బూర్గుపల్లిలో ఎడ్ల బండి పై ర్యాలీలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

మండలంలోని జంగరాయి, మిర్జాపల్లి తదితర గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణులు రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● పెద్దశంకరంపేట: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో రుణమాఫీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండ్లబండ్లపై నిర్వహించిన ర్యాలీలో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, నాయకులు జనార్దన్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: రుణమాఫీని హర్షిస్తూ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కుస్తీ శేఖులు, బాలమల్లయ్య, సంజీవులు, సుదర్శన్, నర్సింలు, ప్రశాంత్, రవితేజ, భిక్షపతి తదితరులు ఉన్నారు.